
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 20 । మే । 2023



డీసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

డీఈఈ సెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని బుక్కపట్నం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు.



టీబీ డ్యాంలో 3.9 టీఎంసీల నీరు

టీబీ డ్యాంలో శుక్రవారం నాటికి 3.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటిమట్టం 1,578.78 అడుగులకు చేరుకుంది. ఔట్‌ఫ్లో 239 క్యూసెక్కులు కొనసాగుతోంది.



జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. నైరుతి దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఆధునికీకరణ పనులు చేపట్టండి



దిశ డీఎస్పీ కార్యాలయ ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: పోలీస్ క్వార్టర్లు, గెస్ట్ హౌస్‌లు, పోలీసు స్టేషన్లను ఆధునీకరించి సిబ్బంది అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన పుట్టపర్తిలోని డీఎస్పీ కార్యాలయం, పోలీస్ గెస్ట్ హౌస్, పోలీస్‌క్వార్టర్లు, దిశ స్టేషన్, పుట్టపర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయా స్టేషన్‌ల ఆవరణ అంతా కలియ దిరిగారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అవసరమైన మేరకు సుందీకరణ పనులు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ కె.వి.రామకృష్ణప్రసాద్, దిశ డీఎస్పీ కె.వి.ఎస్.వరప్రసాద్, పుట్టపర్తి సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఏఆర్ ఆర్ఐ టైటాస్, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్, ఎస్ఐ వీరేష్ ఉన్నారు.

అడిషనల్ ఎస్పీగా విష్ణు

కొత్తచెరువు: జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా ఎన్.విష్ణును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని పలువురు డీఎస్పీలకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎన్.విష్ణుకు పదోన్నతి కల్పించి జిల్లా ఏఎస్పీగా నియమించింది. ఇక్కడ ఏఎస్పీగా పనిచేస్తున్న కె.వి.రామకృష్ణ ప్రసాద్‌ను విజయవాడ సెబ్ ఏఎస్పీగా బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ముగిసిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఏపీసెట్ ఛైర్మన్ జింకా రంగజనార్దన

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్‌లో భాగంగా ఇంజినీరింగ్ స్ట్రీమ్‌కు సంబంధించిన ప్రవేశ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షకు మొత్తం 2,38,180 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,24,724 (94.35శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 136 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ ఈఏపీసెట్ ఛైర్మన్ జింకా రంగజనార్దన తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీ రాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సీబీఐటీ (ప్రొద్దుటూరు)లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

పెనుకొండలో స్కిల్ హబ్ ఏర్పాటు

పెనుకొండ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీ-డాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన యువత పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9014264907, 7382792779 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'సెల్'వుల్లో హెల్ గేమ్స్

- హిందూపురానికి చెందిన దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు సంతానం. ఇద్దరూ ఉద్యోగులు కావడంతో సెలవుల్లో ఇంట్లో ఉంటున్న చిన్నారితో మాట్లాడేందుకు ఓ సెల్‌ఫోన్ కొనిచ్చారు. తల్లిదండ్రులు ఉద్యోగాలకు వెళ్లగానే సదరు బాలుడు మొబైల్‌లో గేమ్స్‌లో మునిగిపోయేవాడు. కనీసం తిండికూడా తినేవాడు కాదు. దీంతో తీవ్ర అనారోగ్యానికి గురైన ఇటీవలే ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించి వైద్యులు కంటి చూపు దెబ్బతిన్నడంతో పాటు ఇతర సమస్యలున్నట్లు గుర్తించారు.
- ధర్మవరం పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలలో చదివే ఐదో తరగతి విద్యార్థిని కళ్లలో మంట వస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేసింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా స్మార్ట్‌ఫోన్ ఎక్కువగా చూడటమే కారణమని నిర్ధారించారు. రెండు వారాల పాటు డ్రాప్స్ వాడితే సరిపోతుందని డాక్టర్లు పేర్కొన్నారు.
- కొత్తచెరువులో 14 ఏళ్ల బాలుడు కంటిచూపు సమస్యతో ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షల అనంతరం కళ్ల జోడు వాడాలని.. స్మార్ట్‌ఫోన్ రాత్రిపూట అతిగా వాడకంతో సమస్య వచ్చినట్లు వైద్యులు వెల్లడించారు.

...ఇలా చాలా మంది చిన్నారులు సెల్‌ఫోన్లలో నిరంతరం గేమ్స్ ఆడుతూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి సెలవుల్లో ఎక్కువగా ఇంట్లోనే ఉండిపోతున్న చిన్నారులు మొబైల్ గేమ్స్‌కు బానిసలుగా మారిపోతున్నారు. తల్లిదండ్రులు సకాలంలో గుర్తించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటున్నారు.



42 శాతం
మొబైల్ ఉపయోగిస్తున్న పదేళ్లలోపు పిల్లలు

71 శాతం
సెల్‌ఫోన్ అందుబాటులో ఉన్న 12 ఏళ్ల లోపు పిల్లలు

91 శాతం
వ్యక్తిగత మొబైల్స్ వినియోగిస్తున్న 14 ఏళ్లలోపు వారు

150 నిమిషాలు
రోజూ సగటున చిన్నారులు మొబైల్స్ వాడే సమయం

- మొబైల్‌కు బానిసలవుతోన్న విద్యార్థులు
- రోజుకు సగటున 150 నిమిషాలపైనే కేటాయింపు
- తదేకంగా చూస్తూ గేమ్స్ ఆడటంతో దుష్పరిణామాలు
- క్రమంగా లోపిస్తున్న మానసిక ఎదుగుదల
- ఆలస్యంగా గుర్తించి ఆస్పత్రులకు పరుగు తీస్తున్న తల్లిదండ్రులు
- పిల్లల దృష్టి క్రీడల వైపు మళ్లించాలంటున్న నిపుణులు

సాక్షి, పుట్టపర్తి: వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లల్లో ఎక్కడా లేని సంబరం. అదే సమయంలో తల్లిదండ్రుల్లో ఓ వైపు ఆనందం.. మరోవైపు ఆందోళన. ఇప్పుడన్నీ చిన్న కుటుంబాలే కావడంతో పిల్లలపై పెద్దల పర్యవేక్షణ కరువవుతోంది. పైగా ప్రతి ఇంట్లోనూ మూడు నుంచి నాలుగు మొబైల్స్ అందుబాటులో ఉంటున్నాయి. దీంతో చిన్నారులు అతి సులువుగా మొబైల్‌కు అలవాటు పడుతున్నారు. అదే పనిగా గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు. కొందరు తల్లులు పిల్లలకు భోజనం తినిపించేందుకూ మొబైల్ చేతిలో పెడుతున్నారు. ఈ క్రమంలో సుమారు 70 శాతం మంది పిల్లలు రోజుకు సగటున 150 నిమిషాల కంటే ఎక్కువ సమయాన్ని మొబైల్ వీక్షించడానికే సమయం కేటాయిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. జిల్లాలో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకూ 2,50,037 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. వీరిలో చాలా మంది విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడటంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో విహార యాత్రలకు వెళ్లడం, బంధువుల ఊళ్లకు వెళ్లడం చేసేవారు. అయితే ప్రస్తుత కంప్యూటర్ కాలంలో అలాంటి సంప్రదాయాలు కనుమరుగు అయిపోయాయి. ఫలితంగా చిన్నారులు మొబైల్స్ గేమ్స్‌కు అలవాటుపడుతున్నారు.

ఆన్‌లైన్ తరగతుల పేరుతో...

కరోనా కారణంగా ఆన్‌లైన్ తరగతుల పేరుతో చాలా మంది తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్లు కొనిచ్చారు. మరికొందరు ఉద్యోగం నిమిత్తమో, జీవనోపాధి కోసమో బయటకు వెళ్తున్న సందర్భంలో యోగక్షేమ సమాచారం కోసం చిన్నారులకు సెల్‌ఫోన్లను అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో చిన్నారులు ఫోన్‌లో మాట్లాడటం పక్కన పెట్టి గేమ్‌లు ఆడేందుకు అలవాటు పడ్డారు. కొందరు పిల్లలు గంటల తరబడి మొబైల్ చూసేస్తున్నారు. ఈ క్రమంలో పక్కన ఏం జరుగుతోందో కూడా గుర్తించలేని స్థితికి చేరారు. మరికొందరు చిన్నారులు రీల్స్ చూస్తూ, చేస్తూ గడిపేస్తున్నారు.

దృష్టి సారిస్తే నియంత్రణ సాధ్యమే..

పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారిస్తే మొబైల్ ఫోన్ వినియోగం నియంత్రించడం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని స్మార్ట్ ఫోన్ కంపెనీలు పేరెంటల్ కంట్రోల్ అనే ఆప్షన్‌ను తీసుకొచ్చాయి. సెట్టింగుల్లో ఫోన్ వినియోగ సమయాన్ని తగ్గించుకోవచ్చు. దీనికి తోడు వేసవి సెలవుల్లో పిల్లలను క్రీడల వైపు దృష్టి మళ్లించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే క్రీడా శిబిరాలకు పంపిస్తే మొబైల్ వాడకంపై దృష్టి తగ్గుతుంది. ఫుట్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, తైక్వాండో, చెస్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలపై శిక్షణ ఇప్పిస్తే శారీరకంగా బలపడుతారు. ఆరోగ్యం బాగుంటుంది.

మానసిక ఎదుగుదల లోపిస్తుంది



పిల్లలు సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడటం వల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చలాకీతనం తగ్గుతుంది. కంటి సమస్యలు, మెడలో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పాతకాలంలో ఆడే ఆటలు ఇప్పటి పిల్లలు ఆడటం లేదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇన్‌డోర్, అవుట్‌డోర్ గేములు ఆడే విధంగా చూడాలి. అలాగే సెలవుల్లో పిల్లలను బంధువుల ఇళ్లకు పంపాలి. వీలైతే పిక్నిక్‌లు, వినోదాలకు తీసుకెళ్లడం వల్ల వారిలో ప్రశాంతత నెలకొంటుంది. అవసరమైతే తప్ప పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వరాదు. ఎక్కువ సేపు ఫోన్లు చూడటం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గుతుంది.

– ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

అనారోగ్య సమస్యలు



ప్రస్తుతం సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. అయితే అతిగా సెల్‌ఫోన్ వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మొబైల్ నుంచి వచ్చే నీలిరంగు లైటు పిల్లల కంటిచూపుపై ప్రభావం చూపిస్తుంది. ఫలితంగా చిన్న వయసులోనే కళ్లజోడు పెట్టుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా వినికిడి లోపం వచ్చే అవకాశం ఉంది. పిల్లల చేతికి మొబైల్ ఇవ్వరాదు. తలనొప్పి, బ్యాక్‌పెయిన్‌తో పాటు మెదడు ఎదుగుదలపై ప్రభావం పడుతుంది.

– డాక్టర్ అజయ్‌కుమార్‌రెడ్డి, కొత్తచెరువు

ముందు జాగ్రత్తతోనే రక్షణ



పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. సెలవుల సమయంలో స్మార్ట్‌ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి. తప్పనిసరి అయితే తప్ప మొబైల్స్ ఇవ్వకూడదు. మొబైల్ వాడకం కారణంగా కళ్ల సమస్యలు వస్తే భవిష్యత్తులో చదవడం కష్టంగా ఉంటుంది. గతేడాది కంటి సమస్య తెచ్చుకున్న విద్యార్థులను గమనించాం. అంతకుముందు తరహాలో చదువుపై శ్రద్ధ చూపడం లేదు. ఇబ్బందులు ఎదురయ్యాక విచారణ చెందడం కంటే ముందు జాగ్రత్తలు పాటిస్తే మంచిది. – కృష్ణమోహన్‌రెడ్డి, హెచ్‌ఎం, పులమతి జెడ్పీహెచ్‌ఎస్, లేపాక్షి

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- మిల్లెట్ మహోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: చిరుధాన్యపు పంటలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో ఏర్పాటు చేసిన 'మిల్లెట్ మహోత్సవ్'ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను రుచి చూసి తయారు చేసిన డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశంసించారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చిరుధాన్యాల సాగులో జిల్లా ముందంజలో ఉందన్నారు. సజ్జలు, రాగులు, జొన్నలు తదితర చిరుధాన్యాల్లో పోషక పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటిని ఆహారంగా తీసుకున్న పాతతరం ఆరోగ్యంగా ఉండేదన్నారు. నేటి తరానికి చిరుధాన్యాల ప్రాధాన్యత తెలిపి విరివిగా వినియోగించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాలకు సాగుకు జిల్లాలో అనువైన వాతావరణం ఉన్నందున సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. ప్రభుత్వం కూడా మద్దతు ధరతో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. అలాగే చిరుధాన్యాల వినియోగం పెంచేందుకు జూన్ నుంచి బియ్యం వద్దనుకునే కార్డుదారులకు రాగులు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, రాగి, జొన్న, సజ్జ తదితర చిరుధాన్యాలను భోజనంలో భాగం చేసుకుంటే ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరమే ఉండదన్నారు. జిల్లాలో ప్రస్తుతం 60 వేల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు ఉందని, దాన్ని లక్ష ఎకరాల్లోకి తీసుకువచ్చేలా అధికారులు రైతులను ప్రోత్సహించాలన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేసి ఆరోగ్యవంతమైన సమాజం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నెలకు ఒక పాఠశాలను ఎంపిక చేసి చిరుధాన్యాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థి దశ నుంచే చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జిల్లాలో చిరుధాన్యాలు అధికంగా సాగుచేసిన రైతులకు, ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులకు, మహిళా సంఘాల సభ్యులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ రెడ్డి రమణమ్మ చిరుధాన్యాలసాగుపై పాడిన పాట అందరిని అకట్టుకుంది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, సివిల్ సప్లయీస్ డీఎం అశ్వర్థనారాయణ నాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ రమణారెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఎంపీపీ రమణారెడ్డి, 'పుడా' ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసయ్య, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, శాస్త్ర వేత్తలు శ్రీనివాస్, లక్ష్మానాయక్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



పిన్నదరిలో నాడు -నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

తాడిమర్రి: ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరుపట్టిక, ఓపీ, ఫార్మసీ, ల్యాబ్, కాన్పుల గదులు, వ్యక్తి గత మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహేంద్రనాథ్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల కొరత గురించి ప్రస్తావించగా, త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ మండల విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యాకానుక గురించి ఎంఈఓ కృష్ణమోహన్‌ను ఆరా తీశారు. అనంతరం ఆయన పిన్నదరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.31.74 లక్షలతో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు మరుగుదొడ్లు పూర్తయ్యాయని, పాఠశాల అదనపు గదులు, ప్రహరీ నిర్మాణం పనులు జరుగుతున్నాయని ఎంఈఓ తెలిపారు. జూలై 5వ తేదీ నాటికి నాడు- నేడు పనులను పూర్తి చేయాలని ఎంఈఓకు ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, ఈఓఆర్‌డీ కామాక్షి పాల్గొన్నారు.



భానుడు.. దూకుడు

అనంతపురం అగ్రికల్చర్: ఎండలు భగ్గుమంటున్నాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. శుక్రవారం రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. తాడిమర్రిలో అత్యధికంగా 43.2 డిగ్రీలు నమోదు కాగా.. మిగతా మండలాల్లో 40 నుంచి 43 డిగ్రీల మధ్య రికార్డయ్యింది. ఉదయం 9 గంటలకే సెగలు కక్కుతుండటంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

సంక్షేమ యజ్ఞ సారథులు వలంటీర్లు



వలంటీర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు, అధికారులు

- 'వలంటీర్లకు వందనం' సభలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లాలోని 8,490 మందికి అవార్డులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లు సంక్షేమ యజ్ఞ సారథులని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. మూడో ఏడాది చేపట్టిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో విజయవాడలో ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ ఏవి రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి, గ్రామ వార్డు వలంటీర్ల జిల్లా కోఆర్డినేటర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్ట లేనివన్నారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఏటా సన్మానించడం గొప్ప విషయమన్నారు. తాజాగా మూడో ఏడాదీ అవార్డులు అందిస్తూ వలంటీర్ల సేవలకు గుర్తింపు ఇస్తోందన్నారు. అందరికీ ఒక కుటుంబం ఉంటే వలంటీర్లకు 50కిపైగా కుటుంబాలుంటాయని, ఆయా కుటుంబాల్లోని బాగోగులు చూస్తున్న వలంటీర్లకు వందనం చేయాల్సిందేనన్నారు.

జిల్లాలో 8,490 మందికి అవార్డులు..

జిల్లాలో 34 మంది సేవావజ్ర అవార్డుకు ఎంపిక కాగా, వారికి కలెక్టర్, ఎమ్మెల్యే రూ.30 వేలు నగదు, సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జ్, మెడల్ అందజేశారు. సేవారత్న అవార్డుకు ఎంపికైన 193 మందిని రూ.20 వేల నగదు, సర్టిఫికెట్, బ్యాడ్జ్, శాలువ, మెడల్‌తో సత్కరించారు. సేవామిత్ర అవార్డుకు ఎంపికైన 8,263 మందికి రూ.10 వేల నగదు, సర్టిఫికెట్, శాలువ, బ్యాడ్జి, మెడల్‌ను అందజేశారు.

నాకు ఇది మూడో అవార్డు



నాడు ఇది మూడో అవార్డు. తొలి ఏడాది సేవా మిత్ర, రెండో ఏడాది సేవా రత్న అవార్డులు వచ్చాయి. ఇప్పుడు సేవా వజ్ర అవార్డులు రావడం చాలా సంతోషంగా ఉంది. మాపై ఇంతలా నమ్మకం ఉంచిన సీఎం వైఎస్ జగన్ రుణం ఏమిచ్చి తీర్చుకోగలం. జీవితాంతం సీఎం వెంట నడుస్తూ ప్రజలనూ నడిపిస్తాం.

– సాయిలీల, సిద్దరాంపురం, బుక్కపట్నం మండలం

సీఎంకు రుణపడి ఉంటాం



ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న నాకు పిలిచిమరీ వలంటీర్ ఉద్యోగం ఇచ్చి సమాజంలో గుర్తింపు నిచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణ పడి ఉంటా. నాకు తొలిసారి సేవా రత్న అవార్డు రావడం సంతోషంగా ఉంది. అవార్డు స్ఫూర్తితో మరింత మెరుగ్గా పనిచేసి ప్రజలకు సేవలందిస్తా.

– గంగాద్రి, గంగిరెడ్డిపల్లి, పుట్టపర్తి మండలం

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి

- అగ్రి అడ్వయిజరీ బోర్డు సమావేశంలో ఛైర్మన్ రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: తక్కువ పెట్టుబడులతో రైతుకు అధిక ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఈ మేరకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అవుటాల రమణారెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా రైతులు పంటల సాగులో 60 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులు వినియోగిస్తున్నారని, సగానికి తగ్గిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను అందించాలన్నారు. వేరుశనగతో పాటు రాగులు, కందులు, పెసలు, జీలుగ, జనుము, కొర్ర, అరికెలు, సామలు అందివ్వాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ, మామిడి రైతులకు అవగాహన లేక పురుగుమందులు వాడుతున్నారని, దీని ప్రభావం మామిడి నాణ్యతపై చూపుతోందన్నారు. అలాగే భూసారం కూడా దెబ్బతింటోందన్నారు. పురుగు మందులకన్నా పంచగవ్య పిచికారీ చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. రైతు గ్రూపులకు యంత్ర సేవ పరికరాలు అందించడానికి ఈ నెలలో మేళాను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలానికి మూడు చొప్పున డ్రోన్లు ఇచ్చే అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఎం లక్ష్మానాయక్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, ఏడీఏలు విద్యావతి, సనావుల్లా పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించండి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ఆర్.కృష్ణానాయక్

రొళ్ల: గ్రామీణా ప్రాంతాల ప్రజలను వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని డిస్ట్రిక్ కోఆపరేటీవ్ ఆఫీసర్ ఆర్.కృష్ణానాయక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. తొలుత రికార్డులు తనిఖీ చేసి ఓపీ వివరాల పై ఆరా తీశారు. అనంతరం ప్రసూతి, ఎక్స్‌రే గదులను పరిశీలించారు. మందుల కొరత ఏమైన ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాడు–నేడు పథకం కింద రూ.1.85 కోట్ల వ్యయానికిపైగా కొత్తగా నిర్మించిన సీహెచ్‌సీ ఆస్పత్రిని పరిశీలించారు. కర్ణాటక సరిహద్దుగా ఉన్న రొళ్ల మండలంలో మారుమూల ప్రాంతాల నుంచి వైద్య కోసం వచ్చే రోగులకు సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుత్తి: గుత్తి కోటలోని దిడ్డి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమేష్ నాయక్ ,పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కను పురుగుల మందు డబ్బా ఉంది. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా చంపి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి పురుగుల మందు డబ్బా అక్కడ ఉంచారా ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు డాక్టర్‌ను అక్కడికే పిలిపించి పోస్టు మార్టం చేయించారు. మృతదేహాన్ని ఖననం చేశారు.

వర్సిటీలోనే కొలువు

- దన్నుగా నిలుస్తున్న అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం
- బీటెక్, పీజీ పూర్తి చేసిన వారికి క్యాంపస్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం
- వర్సిటీలు, జిల్లాకు చెందిన గ్రామీణ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత
- ఇప్పటికే 50 మందికి ఉద్యోగ కల్పన
- 1,500 మందికి సాఫ్ట్‌వేర్ కొలువులు కల్పించేలా చర్యలు
- క్యాంపస్‌లోనే ఉద్యోగాలు కల్పించే వర్సిటీగా ఎస్కేయూకు ప్రత్యేక గుర్తింపు



అమెరికన్ రిక్రూటింగ్ ప్లాట్‌ఫాంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం విద్యార్థులకు దన్నుగా నిలుస్తోంది. ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగడానికి చేయూతనివ్వడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారుకావడానికి దోహదపడుతోంది. కొత్త ఆలోచనతో వస్తే ఆవిష్కరణ దిశగా తీసుకెళ్లేంత వరకు చేయూతనిస్తోంది. ఇందులో ఇప్పటికే 21 స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. తద్వారా ఉద్యోగాలు కల్పించే వేదికగానూ రూపుదిద్దుకుంది. అగ్రికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిసిటీ అండ్ రెనెవబుల్ ఎనర్జీ, ఐసీటీ అండ్ ఐటీ సొల్యూషన్స్ విభాగాల్లో స్టార్టప్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. హెలెన్‌బైక్స్, ఆర్, సుచంద్ర టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అజిరా పవర్, వెబ్సికా డేటా సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ , అవాన్ టెక్, టెక్నోహబ్, ప్రవీణ్ ఫుడ్ టెక్, బెర్రిస్, అర్బర్ నేచర్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి కంపెనీలు ఇందులో పాలుపంచుకుంటున్నాయి. ఇందులో నమోదైన సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎస్కేయూ విద్యార్థులకు కొలువుల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపట్టారు.

భారీఎత్తున ఉద్యోగ కల్పన దిశగా..

అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో స్టార్టప్‌లతో పాటు ఏడాదికి రూ.800 కోట్ల టర్నోవర్ కలిగిన అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్ కంపెనీ నూతన పరిశోధనలు, ఆవిష్కరణలకు సంబంధించి నమోదు చేసుకుంది. ఈ కంపెనీ అమెరికన్ రిక్రూటింగ్, టెస్టింగ్ టూల్స్ ప్లాట్‌ఫాంల మీద ఎస్కే యూనివర్సిటీలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తోంది. ఇప్పటికే 50 మందిని నియమించుకుంది. ఇందులో సింహభాగం ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురంలో బీటెక్ పూర్తి చేసిన వారే. ఈ యూనివర్సిటీల్లో బీటెక్, పీజీ చదివే విద్యార్థులతో పాటు జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించే ప్రధాన ఉద్దేశంతో ఇంక్యుబేషన్ కేంద్రంలోనే కంపెనీ ఏర్పాటు చేశారు. వర్సిటీలో ఇలా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేయడం రాష్ట్రంలోనే తొలిసారి కావడం విశేషం. ఇక్కడ మొత్తం 1,500 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రాత్రి పూట విధులు నిర్వర్తించే వారికి క్యాబ్‌లు, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక భద్రత సైతం ఏర్పాటు చేస్తున్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోవాలని..



నేను అనంతపురంలోనే చదువుకున్నా. జన్మభూమి రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడ కంపెనీ శాఖ ప్రారంభించాం. అంతర్జాతీయ స్థాయిలో టాప్–500 కంపెనీల్లో అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ ఒకటి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు దన్నుగా నిలవాలనే ఉద్దేశంతో అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ఎంపిక చేసుకున్నాం. బీటెక్, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు మెట్రో సిటీలకు వెళ్లి ఉద్యోగాలు వెతుక్కునే అవసరం లేకుండా వారు చదివిన ప్రాంతంలోనే అవకాశాలు కల్పిస్తున్నాం.

– రాజ్ చప్పిడి, అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ (ఏజీఎస్), సీఈఓ కమ్ ఫౌండర్

1,500 మందికి ఉద్యోగాలిస్తాం



మా కంపెనీలో ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురంలో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు తొలి ప్రాధాన్యతనిస్తాం. భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అలవరచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఇందుకోసం తొలుత నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నాం. 1,500 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తున్నాం.

–దామోదర్ జే, వైస్ ప్రెసిడెంట్, అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్

ఇక్కడే ఉద్యోగం లభించడం సంతోషంగా ఉంది



జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని మోహన్‌బాబు ఇంజినీరింగ్ కళాశాలలో 2021లో బీటెక్ పూర్తిచేశా. దూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయాలంటే ఇబ్బంది. అనంతపురంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కల్పించారు. ప్రస్తుతం ట్రెనింగ్‌లో ఉన్నా. ట్రెనింగ్‌లోనే నెలకు రూ.15 వేల వేతనం ఇస్తున్నారు. మంచి ప్లాట్‌ఫాం దొరికినందుకు ఆనందంగా ఉంది.

– ప్రశాంత్, అనంతపురం.

అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి



వర్సిటీలోని ఇంక్యుబేషన్ కేంద్రంలో స్టార్టప్‌లతో పాటు పేరెన్నిక గల కంపెనీలు సైతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో అవకాశాలను ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ గ్రాడ్యుయేట్లు అందిపుచ్చుకోవాలి. ఇంక్యుబేషన్ కేంద్రం పనితీరు అద్భుతంగా ఉంది. స్వయాన కేంద్ర ప్రణాళికా శాఖ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ గతేడాది డిసెంబర్ 11న పార్లమెంట్‌లోనే ప్రశంసించారు. ఈ కేంద్రానికి మూడు అంతర్జాతీయ స్థాయి అవార్డులు కూడా దక్కడం వర్సిటీకే గర్వకారణం.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వైస్ చాన్సలర్, ఎస్కేయూ

మల్లారెడ్డికి జాతీయస్థాయి అవార్డు

- 'నేషనల్ వాటర్ అవార్డు' ప్రకటించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ



డాక్టర్ వైవీ మల్లారెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఇప్పటికే పలు అవార్డులు, రివార్డులు సాధించిన స్థానిక ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు డాక్టర్ వైవీ మల్లారెడ్డి మరో ప్రతిష్టాత్మకమైన పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ రీసోర్స్ రివర్ డెవలప్‌మెంట్ అండ్ గంగా రిజున్వేషన్ శాఖ సెక్రటరీ పంకజ్‌కుమార్ నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. నేల, నీటి సంరక్షణ, కరువు నివారణ చర్యలు చేపట్టడంతో విశేష కృషి చేస్తూ రైతులకు విశిష్ట సేవలందిస్తున్నందున రాష్ట్రంలోనే 'బెస్ట్ ఎన్‌జీఓ'గా గుర్తించినట్లు పేర్కొన్నారు. నేషనల్ వాటర్ అవార్డు–2022 కింద స్పెషల్ కన్సలేషన్ అవార్డుకు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డిని ఎంపిక చేశామన్నారు. అవార్డు కింద ట్రోఫీ, ప్రశంసాపత్రం, నగదు పురస్కారం త్వరలోనే ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. దీనిపై డాక్టర్ వైవీ మల్లారెడ్డి స్పందిస్తూ... కరువు పీడిత 'అనంత'లో రైతులు, పేద వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అవార్డు ప్రకటించడం సంతోషమని, ఇది మరింత బాధ్యత పెంచినట్లు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతురాలు రత్నమ్మ

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లలో శుక్రవారం బ్యాళ్ల రత్నమ్మ (28) అనే వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు... పెనకచెర్లకు చెందిన బ్యాళ్ల రత్నమ్మ (28) అనే మహిళ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న నయం కాక పోవడంతో మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలంలో మృత దేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాగర్ తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

అందుబాటులో ఇంటర్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు

ప్రశాంతి నిలయం: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు ఆయా కళాశాలల జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు ఇంటర్ బోర్డ్ ఆర్‌ఐఓ సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

రేపు పీఆర్ ఇంజనీర్ల రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం

- జెడ్పీ ఆవరణలో భారీ ఏర్పాట్లు



అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అనంతపురంలో ఆదివారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలోని డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి సమీక్షించారు. ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్, జనరల్ సెక్రటరీ ప్రసాద్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాగేంద్రకుమార్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మధుప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పీఆర్ ఇంజినీర్ల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ మద్దిలేటి, డీఈఈ గురుమూర్తి, ఏఈఈ వరప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణం నాయుడు, ప్రధాన కార్యదర్శి సంగీతరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్న దృష్ట్యా ఏర్పాట్లలో ఎక్కడా లోపం ఉండకూడదని భాస్కర్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్టర్ల ఒత్తిళ్లు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి సానుకూల వాతావరణంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని చర్చించారు. ఆర్థికపర ఇబ్బందులు ఉన్నా.. ప్రభుత్వం తన పరిధిలో శక్తికి మించి సాయం చేస్తోందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంతో స్నేహపూర్వక వాతావరణంలోనే సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేద్దామని ప్రతినిధులు నిర్ణయించారు.

సొసైటీల ద్వారా మెరుగైన సేవలు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీల) ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. శుక్రవారం స్థానిక డీసీసీబీ హాలులో కంప్యూటరీకరణ అంశంపై పీఏసీఎస్ సీఈఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాబార్డు, ఆప్కాబ్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సొసైటీల్లో కంప్యూటరీకరణ పూర్తి దశకు వచ్చిందన్నారు. త్వరలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుండటంతో రైతులకు మరింత పారదర్శకమైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, ఆప్కాబ్ అధికారి కె.విజయచంద్రారెడ్డి, జీఎం కె.సురేఖారాణి, డీపీడీఎం తేజశ్విని, నాబార్డు డీడీఎం కె.అనురాధ, డీసీఓ ఎం.ప్రభాకరరెడ్డి, ఓఎస్‌డీ దినేష్‌కుమార్, డీజీఎం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జూడో జట్ల ఎంపిక



రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు

కళ్యాణదుర్గం: 66వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల జూడో చాంపియన్‌షిప్ అండర్ –19 ఎంపిక పోటీలు స్థానిక జ్ఞానభారతి ప్రైవేట్ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం జరిగాయి. అనంతపురం జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో చిత్తూరు బాలబాలికల జట్లు నిలిచాయి. కళ్యాణదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు, జూడో అసోసియేషన్ సీఈఓ బాబు, కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర జూడో జట్లను ఎంపిక చేశారు. జూన్ 10 నుంచి 13 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

బాలుర జట్టు..

కె.చందు (అనంతపురం, కె.విశాంత్ కుమార్ (శ్రీకాకుళం, కె.పవన్ కుమార్ (శ్రీకాకుళం), ఈ.సంతోష్ (అనంతపురం), ఓ.పుల్లారెడ్డి (అనంతపురం), జి.విష్ణు (అనంతపురం), డి.విష్ణువర్ధన్ (అనంతపురం), వై శివసాయి (చిత్తూరు), ఎస్.యశ్వంత్ ప్రసాద్ (శ్రీకాకుళం).

బాలికల జట్టు..

సి.నిఖిత (అనంతపురం), కె.సౌమ్య రాణి (శ్రీకాకుళం), పి.పార్వతి భాయి (అనంతపురం), పి.అలేఖ్య (వెస్ట్ గోదావరి), కె.మహిత (అనంతపురం), బి.అక్షయ (అనంతపురం), ఎస్.పూజిత భాయి (అనంతపురం), బి.రాములమ్మ (కర్నూల్), జి.హారిక (అనంతపురం), వై.శ్రీనిత్య (అనంతపురం).

సమస్యలు పరిష్కరించండి



ర్యాలీగా వస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు

- కడపలో 5 జిల్లాల ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ర్యాలీ

వైవీయూ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుంచి హరిత టూరిజం హోటల్ వరకు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రేటర్ రాయలసీమ పరిధిలోని కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు చెందిన కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 10 విశ్వవిద్యాలయాలకు అనుబంధంగా 1100 డిగ్రీ కళాశాలలు నడుస్తున్నాయన్నారు. ఇంజినీరింగ్ చదవలేని పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను అందిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సమస్యలను ప్రభుత్వం తీర్చాలని కోరారు. జీఓ నంబర్ 36కు అనుగుణంగా నూతన, అదనపు కోర్సులకు నోటిఫికేషన్ ఇచ్చారని, దీని ద్వారా కొత్త కోర్సులు పొందాలంటే ప్రతి కళాశాల యూజీసీ 2ఎఫ్, 12బి, న్యాక్ అనుమతి ఉండాలన్న నిబంధన పెట్టారన్నారు. ఈ నిబంధనలతో రాష్ట్రంలో ఏ కళాశాలకు కూడా కొత్త కోర్సులు వచ్చే అవకాశం లేదన్నారు. అందువల్ల పాత కళాశాలలకు జీఓ నంబర్ 36ను సవరించాలన్నారు. అలాగే ఆన్‌లైన్ ప్రవేశాలపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

హత్యకేసును ఛేదించిన పోలీసులు



హత్య కేసులో నిందితుల అరెస్టును చూపుతున్న గోరంట్ల పోలీసులు

గోరంట్ల: మండల పరిధిలోని బుడ్డపల్లి సమీపంలో ఈనెల 4న జాతీయ రహదారి పక్కన బ్రిడ్జి కింద గోరంట్ల పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతున్ని హత్య చేసి పడేసి వెళ్లినట్లు అప్పట్లో పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోలీసుల విచారణలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం హిందూపురానికి చెందిన ఇలియాజ్ (అలియాస్)ఇల్లుగా గుర్తించినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఇలియాజ్ హిందూపురానికి చెందిన కావడి దుర్గప్రసాద్ గ్యాంగ్‌లో ముఖ్య అనుచరుడన్నారు. దుర్గ ప్రసాద్ చనిపోయిన తరువాత గ్యాంగ్ సభ్యుల మహిళలతో ఇలియాజ్ అక్రమ సంబంధాలు పెట్టుకోవడం, మహిళలను అక్రమ కేసుల్లో ఇరికించడనే నేపంతో ఎరికల మహీంద్ర, ప్రవీణ్‌కుమార్, సాయివినయ్ కక్ష్య పెంచుకున్నారన్నారు. ఇలియాజ్‌ను హిందూపురం లయోలా కళాశాల గ్రౌండ్‌లో నిర్మానుష్య ప్రాంతంలో మద్యం తాగించి స్పృహ కోల్పోయిన తరువాత కత్తి, కొడవళ్లతో హత్య చేశారన్నారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా కారులో ఇలియజ్ మృతదేహాన్ని తీసుకొచ్చి బుడ్డపల్లి సమీపంలో బిడ్జి కింద అదేరోజు రాత్రి పారేసి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఇలియాజ్ హత్య కేసుల్లో నిందితులైన మహీంద్ర, ప్రవీణ్‌కుమార్, సాయివినయ్‌లను గురువారం హిందూపురం సమీపంలో అరెస్టు చేశామన్నారు. హత్యకు ఉపయోగించిన కత్తి , కొడవలి, కారు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు నిందితులను పెనుకొండ కోర్టులో శుక్రవారం హాజరుపరిచినట్లు చెప్పారు. మృతుడు ఇలియాజ్ పలు కేసుల్లో ముద్దయిగా ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

సెంటర్ చిరునామా మార్పు

ప్రశాంతి నిలయం: ఏపీఆర్‌జేసీ సెట్–2023 పరీక్షల నిర్వహణకు సంబంధించి ధర్మవరంలోని సెంటర్ నంబర్–2307 విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు సంబంధించి చిరునామాను మార్పుచేసినట్లు ఏపీఆర్‌జేసీ కొడిగెనహళ్లి ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ , గాంధీనగర్, ధర్మవరం అని హాల్ టికెట్లలో ముద్రించినట్లు చెప్పారు. అయితే విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల రేగాటిపల్లి రోడ్డు, ధర్మవరం అని సవరించుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లు, విద్యార్థులు గమనించాలని సూచించారు.